# అమ్మ మనసంతా కమ్మదనం

- వాలి హిరణ్మయీదేవి

మునివేళ్లలో జుట్టు సవరించుకుంటూ పెరట్లోకి వచ్చింది నవ్య. తుల సికోట చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న సావిత్రి ఆమెను చూసి పలకరింపుగా నవ్వి "అప్పుడే లేచావేంటి? ఇంకాస్సేపు పడుకోకపోయావా? ప్రయాణంలో అలసిపోయి వుంటావు కదమ్మా" అంది నవ్వుతూ.

సన్నని జలతరంగణిలాంటి నవ్వు. ఆ చిరునవ్వు చాలు సేదతీరేందుకు. 'ఈ నవ్వుకే కాబోలు నాన్నగారు అంతగా రిలాక్స్‌డ్‌గా కనబడుతుంటారు' అనుకుంది నవ్య.

"తొందరగా మొహం కడుక్కుని రా. కాఫీ డికాషన్ తీసి వుంచాను" అంటూ వంటింట్లోకి వెళ్లింది సావిత్రి.

ఇంట్లో పేస్ట్ వాడడమే అలవాటైనా తమ పుట్టింటికి వస్తే మాత్రం నవ్య తన తల్లిదండ్రుల్లాగే వేపపుల్లతో పళ్ళు తోముకుంటుంది.

వేపపుల్ల నములుతూ ఓసారి తన దృష్టిని సారించింది. తాటాకులతో నేసిన విశాలమైన ఇల్లు- ఎన్నిసార్లు చెప్పినా ఈ ఇంటిలోని చల్లదనం మరోలా రాదు అంటూ దానిని డాబా ఇల్లుగా మార్చే ప్రయత్నం చేయలేదు ఆమె తండ్రి వెంకటేశ్వరరావు.

పెరటి చుట్టూ మేకలన్నీ రాకుండా చుట్టూ కంచె. ఆ కంచె మీద అల్లిబిల్లిగా అల్లుకున్న కాకర పాదు, దొండకాయలు అక్కాచెల్లెళ్లా కలసిమెలసి పోటీపడుతూ తమ కాయలను ప్రదర్శిస్తున్నాయి. తాటాకు ఇంటి కప్పుపై పాకిన ఆనపపాదు నిండా కాయలు విరగకాస్తున్నాయి.

మరో మూల పందిరిమీద బీర, పొట్ల పాదులు, కంచె చుట్టూ గోతులు తవ్వి పెట్టిన చేమంతి మొక్కలు, కనకాంబరాల మొక్కలు. మరోమూల కరివేపాకు, బొప్పాయి, జామచెట్లు.

ఆ పెరట్లో గడిపితే చాలు మనసు ఉల్లాసభరితంగా వుంటుంది నవ్యకి.

పట్నంలో ఉరుకుల పరుగుల జీవితాలకు అలవాటుపడిన వాళ్లకి ఈ పెరడు చూస్తే చాలు ప్రాణం లేచొస్తుంది.

తనకీ అలా పెంచాలని వున్నా స్థలంలేదు. ఉన్న కాస్త స్థలంలో పెంచేందుకు టైమ్, ఓపికా రెండూలేవు.

అందుకే తల్లికున్న ఓపికకి, సహనానికి విస్తుపోతూ వుంటుంది. మొహం కడుక్కుని లోపలికి అడుగుపెట్టేసరికి కాఫీ ఘుమఘుమలు రారమ్మని పిలిచాయి ఆమెని.

"ఇంద...కాఫీ తాగు మీవారికి పంచదార తక్కువగా కావాలిగా. అందుకే విడిగా ఆ ఫ్లాస్క్‌లో పోసి వుంచాను" అంటూ కాఫీ గ్లాసందించింది సావిత్రి.

గ్లాసందుకుని కాఫీ సిప్ చేస్తూ "ఎంతైనా నీ చేతి కాఫీ రుచే వేరమ్మా. ఒక్క గుక్కకే ప్రాణం లేచొస్తుంది" అంది నవ్య.

"ఏదీ అదే చేత్తో నాకూ కాస్త ప్రాణాల్ని ప్రసాదించండి" అంటూ వచ్చాడు వెంకటేశ్వరరావు.

"ఇదీ వరస. రోజుకిన్నిసార్లు కాఫీ వద్దంటే వినరు కదా" అంటూ చిన్న గ్లాసులో కాఫీ అందించింది.

"ఆడపిల్లలూ! ముందుగా మీరు స్నానాలు కానీయండి. తరువాత అన్నయ్యలు చేస్తారు. స్నానం చేసి కొత్త చీర కట్టుకో" అంది సావిత్రి నవ్వుతో.

పిల్లలతోపాటు తాను చిన్నపిల్లవాడై ఆడుతున్న తండ్రిని చూస్తూ 'మళ్లీ నాన్న లేచి ఇలా తిరుగుతాడనుకున్నారా తామంతా! ఎంతో శ్రద్ధతో, ఓపికతో సేవలు చేసి టైమ్ ప్రకారం మందులు అందిస్తూ అలనాటి సావిత్రిలాగే తన తండ్రి ప్రాణాల్ని నిలబెట్టింది అమ్మ' అనుకుంది నవ్య బాత్రూమ్‌కెళుతూ.

అప్పుడే లేచి వచ్చిన సాయి, ప్రకాశ్‌ల కళ్లల్లోనూ అదే దృశ్యం కనిపించి వారి మనస్సుల్లోనూ అదే భావం కదలాడింది.

"అత్తయ్యగారూ! ఆ పప్పు నేను రుబ్బుతాను గానీ మీరు లేవండి రోటి దగ్గర్నుంచి. అయినా మిక్సీ వుంచుకుని ఇంత కష్టపడడం దేనికండి" అంది రవళి.

"అమ్మ చేతి పెరుగువడలకి అంత రుచి ఆ కష్టంవల్లే వస్తుంది కాబోలు మీ వదిన చేస్తే ఆ రుచి రాదెందుకో" అన్నాడు సాయి.

"నేనూ రుబ్బే చేసాగానీ మరెందుకో అలా మెత్తగా, నోట్లోవేసుకోగానే కరిగిపోయేలా రావు" అంది సాలోచనగా పెద్దకోడలు రాణి.

"మా అమ్మ తన ప్రేమనంతా కుమ్మరించి చేస్తుంది. అదీ అసలు కారణం" సింపుల్‌గా చెప్పాడు ప్రకాశ్.

బొబ్బట్లు, పులిహోర పండక్కని స్పెషల్‌గా చేసిన ఆవడలు, అరిసెలతో భోజనాలు ముగించేసరికి అందరికీ భుక్తాయాసం వచ్చేసింది. అందరూ నడుం వాల్చినా వంటిల్లు సర్దడంలో మునిగింది సావిత్రి.

మూడున్నరవుతుండగా "నవ్యా, భవ్యా, రవళీ లేవండిక. లేచి కొత్త చీరలు కట్టుకోండి. పేరంటాలు వస్తారిక బొమ్మల కొలువుకి" అంటూ వాళ్లని లేపింది సావిత్రి.

లేచి తయారవసాగారు.

"అత్తయ్యగారు ఒక్కక్షణం ఖాళీగా ఉండరు కదా" అంటూ రాణీ ఆమె చేతుల్లోని ట్రే అందుకుని అందులో తమలపాకులు, వక్కలు, పళ్లూ పేర్చసాగింది.

అలసట నిండిన సావిత్రి మొహం చూడగానే జాలేసింది వెంకటేశ్వరావుకి.

'సంక్రాంతి పండుగ వస్తే చాలు... రెక్కలు ముక్కలు చేసుకుంటుంది. పిల్లలంతా వస్తారంటూ నాలుగురకాల పిండివంటలు చేస్తుంది. వాళ్ళు వెళ్ళేంతవరకూ గిరగిరా తిరుగుతూ పనంతా చేస్తుంది.

ఉద్యోగాలరీత్యా తలో చోటా వుంటారు. అందరూ కలుసుకునేది పండగకే. అందుకే పండుగ సంబరం అందరూ పొందేలా చేస్తుంది' అనుకున్నాడు.

అతని మనసు గ్రహించినట్లు చిన్న కూతురు భవ్య-

"అమ్మా! నువ్వు కాస్సేపు నడుం వాల్చరాదూ.

పేరంటం పని మేము చూసుకుంటాంగా" అంది సావిత్రితో.

"సంధ్యవేళ పడకెందుకులే. నేను లేచి టీ పెడతాను. అల్లుళ్ల లేచారు కదా" అంటూ వంటింట్లోకి వెళ్లింది సావిత్రి.

బొమ్మల కొలువు పేరంటం అయ్యాక మనవలతో కాస్సేపు ఆడాక భోజనాల టైము అవుతుందంటూ మళ్లీ ఆ పనిలో పడిందామె.

భోజనాలవీ అయ్యాక అందర్నీ ఓ దగ్గర కూర్చోబెట్టి ఓ తెల్లటి బట్ట పీలిక నూనెలో ముంచి అందరి మీద నుండి ఎడమనుండి కుడికి, పైనుండి కిందకీ, మూడు మూడుసార్లు తిప్పి "ఇరుగు దిష్టి, పొరుగు దిష్టి, ఏ దిష్టీ తగలకుండా ఉండాలి. ఆ దేవి మిమ్మల్నందర్నీ చల్లగా చూడాలి" అంటూ ఆ పీలికను అగ్గిపుల్లతో అంటించింది.

అది చిటపటలాడుతూ కాలుతుంటే "చూసారా! పిల్లలందరికీ ఎంత దిష్టి తగిలిందో?" అంటూ ఆ నుసిని అవతల పారేసి చేతులు కడుక్కొని వచ్చింది సావిత్రి.

ఆమెది మూఢ నమ్మకమయినా ఆ చర్య వెనుక తమ మీదగల అభిమానం, ప్రేమ ప్రస్ఫుటమవడం వారందరికీ అర్ధమై మనసులో ఆర్ధ్రమయ్యాయి. వెంకటేశ్వరరావు కళ్ళు చెమర్చాయి.

***

నాలుగురోజులుండి ఐదోరోజున ఒకొక్కరూ ప్రయాణమవుతుంటే "ఎప్పుడొచ్చినా ఒక వారం రోజులైనా ఉండరుకదా" అంటూ బాధపడుతున్న సావిత్రిని చూస్తే అందరికీ బాధనిపించినా నిస్సహాయంగా ఎవరి పనుల్లో వారు మునిగిపోయారు.

"పిల్లలంతా వెళ్లాక ఇల్లెంత బోసిపోయిందో" అంది సావిత్రి. ఆ మాట అనడం ఆరోసారి.

"ఎంతైనా పిల్లలు తిరిగే ఇల్లే కళకళలాడుతూ వుంటుంది కదండీ" అంది గోడకి నీరసంగా చతికిలబడుతూ.

అదే ఫీలింగ్‌తోవున్న వెంకటేశ్వరరావు ఆలోచిస్తూ "మనం ఓ క్రష్ ఏర్పాటు చేస్తే ఎలా వుంటుందోయ్. ఇంటి నిండా పిల్లలుంటారు. పైగా రాబడి కూడా వుంటుంది. ఆలోచించు" అన్నాడు.



## జోడి

"అక్కా! నువ్వు ఆ నెల్లూరు సంబంధం ఖచ్చితంగా చేసుకో. అతను చాలా బాగున్నాడు"

"అంత బాగా నచ్చితే నువ్వు చేసుకోరాదుటే" అంది అక్క.

"అతను పెళ్లిచూపుల్లో మహా పొగరుగా ప్రవర్తించాడక్కా. నాకేంటి అన్న ధీమాలో వున్నాడు. ఎవర్నీ లెక్కచేయను అన్నట్లున్నాడు. మీసం మెలేసాడు. అతని పొగరంతా తగ్గాలంటే నువ్వే సరైన జోడి..." ముక్కు ఎగబీలుస్తూ చెప్పింది వాణి.

## అదృష్టం

"ఏమిటే మీ నాన్న బోడి గొప్ప. ప్రతిదానికీ నాతో ఆయన్ని పోల్చి పొగుడుతుంటావ్?"

"మా నాన్న వంట ఎంత బాగా చేస్తారో తెలుసా? మా అమ్మ లొట్టలు వేసుకుంటూ తింటుంది"

"నేనూ చేస్తున్నాగా?"

"ఆ...మహా చేస్తున్నారులెండి రుచీపచీ లేకుండా. నా ఖర్మ... ఏం మొగుడో మాయదారి మొగుడు. మా అమ్మ అదృష్టం నాకు ఎక్కడిది?"

**–వనుపులేటి సాయిలక్ష్మి** (నెల్లూరు)

## అప్పు

"అరడజను సూపర్‌బజార్లు తిరిగినా నాకు కావలసింది దొరకలేదు"

"అలాగా! ఇంతకూ నీకు కావల్సింది ఏమిటి?"

"అప్పు!"

**–పద్మశ్రీ** (మాణిక్యారం)

"ఆ ఆలోచనే అనవసరం" అంది సావిత్రి.

తన ఏ మాటని తిరస్కరించని సావిత్రి అలా అనేసరికి ఆశ్చర్యపోతూ చూసాడతను. అది గమనించి "అది కాదండీ. సంపాదనకి అలవాటుపడితే మన పిల్లల రాకపోకలు మనకు ఇబ్బందిని కలిగిస్తాయి. వాళ్లకీ ఇబ్బంది. వారి రాక కోసం ఎదురు చూడడంలో మనం అనుభవిస్తున్న ఈ ఫీలింగ్స్ అప్పుడు వుండవు. ఎప్పుడు వెళ్లిపోతారా అని చూస్తాం. వాళ్ళు వున్న నాలుగురోజులూ సరదాగా గడపలేరు" అంది సావిత్రి.

'డబ్బుని మించి పిల్లల గురించి ఆలోచించగలిగేది తల్లి కదా' అని మురిపెంగా అనుకుంటూ ఆమె తలని ప్రేమగా నిమిరాడతను.

***

రోజులు చకచకా దొర్లిపోతున్నాయి.

"లెటరొచ్చింది. ఎవరి దగ్గరనుంచో చెప్పుకో చూద్దాం" చిన్నపిల్లాడిలా సంబరపడుతూ అడిగాడు వెంకటేశ్వరరావు.

"మన పిల్లలే రాసి వుంటారుగానీ ఎవరో చెప్పండి" ఆత్రంగా అడిగింది సావిత్రి.

"పెద్దాడు రాసాడు" ఆనందంగా చెప్పాడు వెంకటేశ్వరరావు.

"చదివి వినిపించండి. మీరు చదివితే వినడమే నాకిష్టం" అంటూ నేలమీద కూర్చుంది సావిత్రి.

"పూజ్యులైన అమ్మానాన్నగార్లకు నమస్కారములు. మేమంతా క్షేమంగా చేరాము. మీరూ క్షేమమని ఆశిస్తాము. మొన్న మేమందరం కలసి ఓ నిర్ణయం తీసుకున్నాం. అది నెరవేరడంలో అమ్మ ప్రాధాన్యత అవసరం"

"చూసారా! చెట్టంత నాన్న మీద లేని నమ్మకం ఈ పిట్టంత అమ్మ మీదే ఉంది" అన్నాడు వెంటేశ్వరరావు అలుగుతున్నట్లు.

"అబ్బ మీ అలకలు తరువాత. ముందు పూర్తిగా చదవండి" అంది సావిత్రి చిరుకోపంగా.

"అమ్మా! నాన్నగారికి వచ్చేనెలగాక ఆపై నెలకి అరవయ్యవ ఏడు వస్తుంది. దాన్ని పురస్కరించుకుని షష్ఠిపూర్తిని ఘనంగా జరపాలని మా అందరి కోరిక. నాన్నేమో ఇలాంటి ఆర్భాటాలు నాకు గిట్టవు అంటారు. నువ్వేమో నాన్న మాటకి తందాన తాన అంటావు. అమ్మా! ప్లీజ్ ఈసారి మాత్రం మేమంతా నిన్ను ప్రేమగా డిమాండ్ చేసేదేమిటంటే ఎలాగైనాసరే నాన్నని ఈ పనికి ఒప్పించు. నీ మాట కాదనరు. మిమ్మల్ని మా శక్తికొద్దీ పూజించుకుని ఓ పదిమందికి అన్నదానం చేస్తామంతే. అమ్మా! ఒప్పుకున్నావ్ కదా. మా మంచి అమ్మ. మీలాంటి తల్లిదండ్రుల్ని పొందినందుకు... ముఖ్యంగా నీలాంటి తల్లి దొరికినందుకు. అమ్మలోని కమ్మదనాన్ని మాకు పరిపూర్ణంగా రుచి చూపించిన మహామనీషివి నువ్వు. మాకు పిల్లలు పుట్టగానే నీ దగ్గర వదిలేసి వాళ్ల బాధ్యత నీమీద రుద్దేసి వాళ్ళు ముద్దు ముద్దు మాటలు మాట్లాడే వయసులో ఆ మాటలకు నువ్వు పరవశించే టైమ్‌లో వచ్చి వాళ్లని స్కూల్లో చేర్పించాలంటూ నిర్దాక్షిణ్యంగా వాళ్లని నీనుండి లాక్కుపోయినా పెదవి విప్పి నీ బాధను చెప్పుకోలేదు. అయినా నువ్వు ప్రతిసారీ మమ్మల్నందర్నీ మన్నిస్తూనేవున్నావు. క్షమిస్తూనే వున్నావు. మా సంతోషాన్నే నీ సంతోషంగా భావించే నువ్వు మా ఈ చిన్న కోరికను తీరుస్తావని ఆశిస్తున్నాం. ఆరోగ్యం జాగ్రత్త. నాన్నగారికి మా అందరి నమస్కారాలు. ఇక వుంటాను.

-మీ పెద్దాడు"

చదవడం ముగించి "పేరుకే నా పేరు. రాసే లెటరంతా నీకే కదా" అన్నాడాయన.

"సర్లెండి. ఎవరికి రాసినా అది మనమేకదా" అంటూ ప్రకాశ్‌ని ఏమీ అననీయకుండా ఎప్పట్లాగే అడ్డుపడింది సావిత్రి.

"మరేం రాయమంటావ్?" అడిగాడాయన.


"మీరు మాత్రం వాళ్ల మనసు నొప్పించగలరేంటి?" అంటూ తన అంగీకారాన్ని చెప్పకనే చెప్పిందామె వంటింట్లోకి వెడుతూ.

వెడుతున్న ఆమె వంకే చూస్తూ గతంలోకి జారిపోయాడు వెంకటేశ్వరరావు.

***

"ఆక్సిడెంటై రోడ్డుమీద పడివున్న నన్ను ఆ అమ్మాయే రక్షించకపోతే ఇప్పుడిలా మీతో మాట్లాడగలిగేవాడినేకాదు. ఆ అమ్మాయిలో నాకు ఆ భూదేవే కన్పించింది. తను నన్నూ, నా పిల్లల్ని అభిమానించగలదన్న నమ్మకం కుదిరాకనే పెళ్లి ప్రపోజల్ తెచ్చి ఒప్పించాను" అన్నాడు వెంకటేశ్వరరావు. లలిత పోయిందగ్గర్నుండీ రెండో పెళ్లి చేసుకొమ్మని వెంకటేశ్వరరావుకి చెప్పిన వాళ్లే అతడు సావిత్రిని ఇష్టపడి పెళ్లాడేవరకు రావటాన్ని హర్షించలేకపోతున్నారు.

అక్కడికీ వెంకటేశ్వరరావు బాబాయి పరంధామయ్య అతనిని పిలిచి మెల్లగా "అదికాదురా! ఏ విడోనో, భర్త వదిలేసిన ఆడదాన్నో పెళ్లి చేసుకుంటే ఆమె జీవితాంతం నీ కాళ్ల దగ్గర పడుంటుంది. ఈ పిల్లకా పట్టుమని ముప్పై ఏళ్ళు వున్నట్లు కూడా



కన్పించడంలేదు. పిల్లలా చిన్నవాళ్ళు. వాళ్లని చూసుకోగలదో లేదో. పైగా తన కడుపున ఓ కాయ కాస్తే వీళ్లని నిర్లక్ష్యం చేయదన్న గ్యారంటీ ఏమిటి? నా మాట విని మా బావమరిది కూతుర్ని పెళ్లి చేసుకో'' అంటూ హితబోధ చేసాడు.

కానీ ఎవరేం చెప్పినా వినకుండా వెంకటేశ్వర రావు సావిత్రి మెళ్ళో మూడు ముళ్ళు వేసాడు.

అతని నమ్మకాన్ని వమ్ము చేయకుండా పిల్లల్ని తన స్వంత పిల్లలుగానే భావించిన సావిత్రి ముందుగా వాళ్ళకి తనని అమ్మ అని పిలవడమే అలవాటుచేసింది. వయసులో తాను వున్నప్పటికీ లేని పెద్దరికాన్ని తెచ్చి పెట్టుకుని ఇటు భర్తని అటు పిల్లల్ని లాలనగా చేరదీసింది.

ఎవరూ వేలెత్తి చూపించే అవసరాన్ని కలగనీయకుండా అతి జాగ్రత్తగా మెలిగింది. పిల్లలంతా సంపూర్తిగా సావిత్రిమీదే ఆధారపడిపోయారు.

ఏదన్నా వారి మధ్య గొడవలు లేవతీద్దామని వచ్చే కొందరి ప్రబుద్ధులకు కూడా అలాంటి అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తపడింది సావిత్రి. ఈ విధంగా మెలగవలసి రావడంతో సావిత్రి ఎన్నోసార్లు తన మనస్సుని కష్ట పెట్టుకోవలసివచ్చింది. మరెన్నో నిందల్ని నిష్ఠూరాలని భరించవలసి వచ్చింది.

"అమ్మా! నీకో బాబు పుడతాడటగా. అప్పుడు నువ్వు ఇప్పటిలా ప్రేమగా చూడవటకదా. మా ఫ్రెండ్ వాళ్లమ్మ చెప్పింది. నిజమే అమ్మా'' అంటూ ప్రకాశ్ వచ్చి బేలగా అడుగుతుంటే సావిత్రి కళ్లనీళ్ల పర్యంతమయిపోయింది.

"అమ్మా! నీ పిల్లలం మేమేకదా. మరి ఎదురింటి ఆంటీ నువ్వు మాకు సవతి తల్లివని, మనకింకో చెల్లాయో తమ్ముడో పుడితే నువ్వు మమ్మల్ని వాళ్లతో ఆడుకోనివ్వవని చెబుతుందేమిటి? అసలు సవతి తల్లి అంటే ఏంటమ్మా'' అమాయకంగా అడిగింది నవ్య.

నవ్య, భవ్యలు చిన్నపిల్లలు అవడంతో వారికి తను స్వంత తల్లిననే నమ్మకం. ఆ రాత్రే వెంకటేశ్వరావుతో చెప్పింది "ఏవండీ! నేనొక నిర్ణయానికొచ్చాను. రెండురోజులు మా ఊరువెళ్లి వస్తాను'' అంటూ వెళ్లింది. ఆమె తన పిల్లలకోసం, లోకం నోరు మూయించడంకోసం గర్భస్రావం చేయించుకోవడమే కాకుండా ఇక ఎప్పటికీ తల్లి కాకుండా ఆపరేషన్ చేయించుకుని వచ్చిందని తెలిసిన రోజు వెంకటేశ్వరరావు కదిలిపోయాడు.

ఆనందోద్వేగాలతో సావిత్రిని పట్టుకుని పొగలి పొగలి ఏడ్చాడు. అలా లోకం తనవైపు వేలెత్తి చూపించే అవకాశం లేకుండా చేసింది. కన్నతల్లి అయినా ఎప్పుడయినా పిల్లల్ని విసుక్కోవడం, కొట్టడం చేస్తుంది.

కానీ సావిత్రి వాళ్లని గట్టిగా ఒక్క మాటన్నా అనకుండా కేవలం కంటి చూపులతో గదమాయించేది. పిల్లల చదువు విషయంలోనైతేనేం, పెళ్లిళ్ల విషయంలోనైతేనేం ఎలాంటి వత్తిడి లేకుండా అన్ని పన్లు సవ్యంగా జరిపించింది.

"ఏవండీ! వాడికి ఉత్తరం రాయమంటే అలా ఆలోచనలో పడ్డారు. పోనీ ఫోన్ చేసి చెప్పేయండి'' అంటున్న సావిత్రి మాటలతో ఈ లోకంలోకి వచ్చాడాయన.

***

"మీ పిల్లలు ఎంత బాగా షష్ఠిపూర్తి జరిపించారు. అంత మందికి అన్నదానం చేయడమంటే మాటలా? ఏమయినా రత్నాల్లాంటి పిల్లలు'' అని అంతా మెచ్చుకుంటుంటే గర్వంతో ఉప్పొంగిపోయాడు వెంకటేశ్వరరావు.

ఆయన ఆనందంలో పాలు పంచుకుంది సావిత్రి.

ఫంక్షన్ అంతా అయ్యాక అందర్నీ కూర్చోబెట్టి దిష్టి తీసేసింది సావిత్రి.

అది ఉట్టి చాదస్తమని తెలిసినా ఆ పనికి ఎవరూ అడ్డుపడరు. అది వారికి ఆమెపైగల అభిమానం. చేతులు తుడుచుకుంటూ వస్తున్న సావిత్రి దగ్గరకు వెళ్లి "అమ్మా! ఇది అక్కా, నేను కలసి చేయించాం'' అంటూ ఓ చంద్రహారాన్ని ఆమె మెళ్లో వేసారు.

సావిత్రి కళ్ళు చెమర్చాయి.

"నేనెప్పుడూ ఈ నగలు కోరుకోలేదమ్మా. నేను కోరుకున్న ప్రేమానురాగాలు నాకు పరిపూర్ణంగా దక్కాయి'' అంది సావిత్రి.

"అమ్మా! నాకో డౌట్. చిన్నదాన్నికదా తప్పు పట్టకుండా నా సందేహాన్ని తీర్చవూ'' అడిగింది భవ్య ఆమె ఒళ్ళో పడుకుంటూ.

"చెప్పు ఏంటో?'' అంది నవ్య జుట్టు సవరిస్తూ.

"అమ్మా! సవతి పిల్లల్ని అంతగా ఇష్టపడరు కదా. కానీ నువ్వు మమ్మల్ని నీ స్వంత బిడ్డల్లా ఎలా పెంచావమ్మా?''

నవ్వింది సావిత్రి.

"ప్రేమించు-ప్రేమను పంచు' అనే సూత్రంతో సర్వలోక జనులను ఆప్తబంధువులుగా చేసుకున్న మదర్‌థెరిస్సాను స్ఫూర్తిగా తీసుకున్నాను. అది నాకు ద్విగుణీకృతమై దొరికింది'' అంది తృప్తి నిండిన కళ్లతో సావిత్రి.

★



## నిజమా?

తారలు చాలా కొన్ని ప్రశ్నలకే నిజం అని చెబుతారు. నమ్రతా శిరోద్కర్ ఇప్పుడు ఇలాంటి సమాధానమే చెబుతోంది. మహేష్ మంజ్రేకర్‌తో కలిసి తిరుగుతున్నావని బాగా పుకార్లు వస్తున్నాయి కదా? అంటే అది నిజమే అని ఘంటాపథంగా చెబుతోంది. అసలు సంగతేంటంటే మహేష్ రూపొందించిన అస్తిత్వ, వాస్తవ్ చిత్రాల్లో నటించిన నమ్రతా ఇప్పుడు మరికొన్ని చిత్రాల్లో కూడా నటిస్తోంది. తనకి మంచి ఆఫర్లు ఇచ్చినవారితో స్నేహంగా మెలిగితే తప్పేంటి? అని ఎదురుప్రశ్న వేస్తోంది.

